క్లుప్తంగా

ప్రజా సేవలో పోటీపడాలి
ట్రైనీ కలెక్టర్ శుభం నోఖ్వాల్



జి.కొండూరు: ప్రజలకు సేవలందించడంలో అధికారులు పోటీపడాలని ట్రైనీ కలెక్టర్ శుభం నోఖ్వాల్ అన్నారు. జి.కొండూరు ఎంపీడీఓగా నెలరోజులకు గానూ స్వతంత్ర హోదాలో బాధ్యతలు చేపట్టిన శుభం నోఖ్వాల్ శుక్రవారం తన విధుల నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి గానూ జి.కొండూరు మండల పరిధిలో ఉత్తమ గ్రామ సచివాలయంగా ఎంపికైన చెవుటూరు గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా అధికారులు అంకిత భావంతో పనిచేసినప్పుడే ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రెగ్యులర్ ఎంపీడీఓ రామకృష్ణనాయక్, అధికారులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపాలపై కళాజాతా ప్రదర్శన



ఇబ్రహీంపట్నం: ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అయోడిన్ లోపాలపై కళాజాతా ప్రదర్శన ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్, జాకీర్ హుస్సేన్ కళాశాల, ఈలప్రోలు, తుమ్మలపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. కళాజాతా బృందం ప్రశాంత్‌కుమార్, యడవల్లి వీరయ్య, నాగబాబు, తిరుపతమ్మ తమ ప్రదర్శనతో అయోడిన్ లోపాలు, నివారణోపాయాలను వివరించారు. ఐజీడీ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, సిబ్బంది స్వరూపారాణి, సాంబ శివరావు, స్వప్న, సీత, కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తిరువూరు పట్టణ అధ్యక్షురాలిగా భవానీ



తిరువూరు: బీజేపీ తిరువూరు పట్టణ కమిటీ అధ్యక్షురాలిగా తోట భవానీ ఎన్నికయ్యారని పార్టీ జిల్లా కార్యదర్శి పోలే శాంతి తెలిపారు. శుక్రవారం తిరువూరు బోస్ సెంటర్‌లో నిర్వహించిన పట్టణ అధ్యక్ష ఎన్నిక కార్యక్రమంలో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ పెనుగొండ రామచంద్రరావు, స్థానిక నాయకులు అన్నవరపు సత్యనారాయణ, ఇమ్మానియేలు, గంధం వెంకటరమణ పాల్గొన్నారు.

ఆడబిడ్డకు చదువే అలంకారం
ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ



జి.కొండూరు: సమాజంలో మహిళలు రాణించాలంటే చదువే ప్రధాన అస్త్రమని, ప్రతి ఆడబిడ్డ చదువుకునేలా ప్రోత్సహించే బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణా కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాలు, డ్రాపవుట్స్, బాల్య వివాహాలు వంటి అంశాలపై ఎంపీపీ పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, సీడీపీఓ పుష్పలత, సూపర్‌వైజర్లు జోజీ కటాక్షం, అన్నమ్మ పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన



చాట్రాయి: ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. చాట్రాయిలో రబీ మొక్కజొన్న సాగుకు రైతులకు ఎరువుల యాజమాన్యంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెక్టార్‌కు 200 నుంచి 240 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్‌ను వాడుకోవాలని సూచించారు.

సారా విక్రేత అరెస్టు
ముసునూరు: చెక్కపల్లికి చెందిన చిట్టిబొమ్మ లక్ష్మి ఇంటిలో సోదాలు నిర్వహించి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నల్ల బెల్లం కలిగి ఉన్నా, మద్యం, సారా విక్రయాలు, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే దాడులు చేసి, కేసులు నమోదు చేస్తామని నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య హెచ్చరించారు.

చెంతనే సంస్థలు ఉన్నా.. గ్యాస్‌కు చింతే

- మండల పరిధిలో 14 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు
- గ్యాస్ అయిపోతే 20 కి.మీ. వెళ్లి తెచ్చుకుంటున్న ప్రజలు
- ఏజెన్సీ ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు

జి.కొండూరు: జి.కొండూరులో కేంద్ర ప్రభుత్వ రంగ గ్యాస్ సంస్థలు పక్కనే ఉన్నప్పటికి ఏజెన్సీ ఏర్పాటులో మాత్రం అధికారులు, పాలకులు విఫలం చెందారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే గ్యాస్ ఏజెన్సీల వాహనాల కోసం వినియోగదారులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఒక వేళ వ్యక్తిగత పనుల వలన వాహనం వచ్చిన సమయంలో వినియోగదారుడు అందుబాటులో లేకపోతే 20 కిలోమీటర్లు వెళ్లి గ్యాస్ సిలిండర్‌ను తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని వినియోగదారులు అవేదన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులు హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు.

పెరుగుతున్న వినియోగం

ప్రజలందరూ సంప్రదాయ కట్టెల పొయ్యిని వదిలేసి వంట గ్యాస్‌పైనే ఆధార పడుతున్నారు. జి.కొండూరు మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీలలో 15,105 కుటుంబాలు ఉండగా 14 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. గ్యాస్ వినియోగం అధికమవడంతో గ్యాస్ సిలిండర్ల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల కోసం ఎదురుచూడకుండా ఉండాలంటే జి.కొండూరులో సత్వరమే ఏజెన్సీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



జి.కొండూరు మండల పరిధి కట్టుబడిపాలెం వద్ద ఉన్న హెచ్‌పీసీఎల్ సంస్థ



గ్యాస్ కోసం ద్విచక్రవాహనంపై సిలిండర్‌ను తీసుకు వెళుతున్న వినియోగదారులు (ఫైల్)

కూతవేటు దూరంలో..

జి. కొండూరుకు కూత వేటు దూరంలో ప్రభుత్వ రంగ గ్యాస్ సంస్థలు ఉన్నాయి. భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థలకు అవసరమైన భూములు సైతం జి. కొండూరు మండల ప్రజల నుంచి సేకరించినదే. అయినప్పటికీ మండలంలో ఒక్క ఏజెన్సీ కూడా ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎదురు చూపులు

గ్యాస్ కోసం మండల ప్రజలకు ఎదురు చూపులు తప్పడంలేదు. పక్కనే ఉన్న సంస్థల నుంచి గ్యాస్ సిలిండర్లు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏజెన్సీలకు వెళ్లి తిరిగి మండలానికి సరఫరా కావాల్సి ఉంది. మైలవరంలో ఉన్న భారత్ గ్యాస్ ఏజెన్సీ, ఆగిరిపల్లిలో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ, కొండపల్లిలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్లు జి.కొండూరు మండలానికి సరఫరా అవుతున్నాయి. దీనివలన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ సిలిండర్ల వాహనం వచ్చినప్పుడు వినియోగదారుడు అందుబాటులో లేకపోతే ద్విచక్ర వాహనాలపై వెళ్లి గ్యాస్ సిలిండర్లను తెచ్చుకోవాల్సి వస్తోంది.

గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేయాలి



గ్యాస్ ఏజెన్సీలు లేక జి.కొండూరు మండల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో అతి పెద్ద మండలమైన జి.కొండూరులో ఏజెన్సీ ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరం. అకస్మాత్తుగా గ్యాస్ అయిపోతే మైలవరం వరకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటుకు కృషి చేయాలి.

– బట్టపర్తి రాజు, గ్రామస్తుడు, జి.కొండూరు

ఎదురుచూపులు తప్పడం లేదు



గ్యాస్ సిలిండర్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. గ్యాస్ సిలిండర్ల వాహనం వచ్చిన సమయంలో ఇంటి వద్ద లేకపోతే మైలవరం వెళ్లి సిలిండర్ తెచ్చుకోవాలి. శుభకార్యాలకు అదనపు సిలిండర్లు కావాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. జి.కొండూరులో గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– పజ్జూరు నాగమల్లేశ్వరరావు, గ్రామస్తుడు, జి.కొండూరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంపలగూడెం: పెనుగొలను విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఎస్‌పీడీసీఎల్ పెనుగొలను సబ్‌స్టేషన్ ఇన్‌చార్జి ఏఈ కొమ్ము వాసు తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ లైన్ల పనుల నిర్వహణ నిమిత్తం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సబ్‌స్టేషను పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

వాహనాల తనిఖీ

ఇబ్రహీంపట్నం: ద్విచక్ర వాహనదారులు ప్రాణ రక్షణ కోసం తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సీఐ ఎ.చంద్రశేఖర్ అన్నారు. ఇబ్రహీంపట్నం, గుంటుపల్లిలో జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. హెల్మెట్ ధరించని వారిపై దృష్టి సారించారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాల సమయంలో సురక్షితంగా బయటపడొచ్చన్నారు. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేయకతప్పదని హెచ్చరించారు. ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మారెమ్మ హుండీ కానుకల ఆదాయం రూ. 9.17 లక్షలు



పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని మారెమ్మ అమ్మవారి హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. గన్నవరం డివిజన్ దేవదాయ శాఖ తనిఖీ అధికారి అనురాధ పర్యవేక్షణలో సిబ్బంది జరిపిన లెక్కింపులో మూడు నెలల 20 రోజులకు గాను రూ.9.17 లక్షల ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వీడీడీ ప్రసాద్ తెలిపారు.

మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

ఎంపీపీ ఆరేపల్లి శిరీష

నూజివీడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు సహకరించాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులను సాధ్యమైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలన్నారు. ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రూ.5 కోట్ల నిధులతో గ్రామాల్లో రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలో మండలంలో దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్ నిర్వహిస్తారని చెప్పారు. వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్‌లో రెండు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని, అయితే ఈ పంటలో జింకు లోపంతో పాటు కత్తెర పురుగు ఆశించిందన్నారు. పీఎం కిసాన్ కింద ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. హెచ్ఓ ఆర్.హేమ మాట్లాడుతూ మామిడి రైతులకు అవసరమైన వారికి ఫ్రూట్ కవర్లను రాయితీపై అందిస్తామని వివరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైస్ ఎంపీపీలు అక్కినేని శ్రీవాణి, స్వర్ణలత, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరేపల్లి శిరీష, పక్కన ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించాలి

ఎంపీడీఓ అనూరాధ

మైలవరం: మండల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ అనూరాధ అన్నారు. మైలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సర్వేలు ఒకదాని తర్వాత ఒకటి చేయాల్సి వస్తోందని, ఈ సర్వేలకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సహకరించాలన్నారు. వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ శాఖ, పంచాయతీ కార్యదర్శులు సర్వేలను నిరాకరిస్తే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. పీఎం సూర్య ఘర్ సోలార్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సూర్య ఘర్ సోలార్ యూనిట్ పేద కుటుంబాలకు వరం అని, బడుగు, బలహీన వర్గాలకు రుణ సౌకర్యంతో ఈ యూనిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. మైలవరం తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి డెప్యూటీ కలెక్టర్‌గా త్వరలో ఉద్యోగోన్నతిపై వెళుతున్న సందర్భంగా ఎంపీడీఓ అనూరాధ, ఇతర ప్రభుత్వ మండల శాఖల అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ అనూరాధ

చిరస్మరణీయురాలు సావిత్రిబాయి పూలే

జయంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సంఘ సంస్కర్త, రచయిత, దేశ తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొండపల్లి నాగార్జున పాఠశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎంఈఓ సీహెచ్ పుష్పలత పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ బాలికా విద్య కోసం సావిత్రిబాయి పూలే 1848లో పూణేలో పాఠశాల ప్రారంభించారన్నారు. కుల వ్యవస్థ నిర్మూలన, మహిళాభ్యుదయానికి ఆమె విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయినులను సన్మానించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, పట్టణ శాఖ అధ్యక్షుడు ఎస్.నాగరాజు, హెచ్‌ఎం సర్దార్ సాహెబ్ పాల్గొన్నారు.

- **మైలవరం:** మైలవరం తారక రామానగర్ ఎంపీపీ పాఠశాలలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఆర్‌టీయూ మైలవరం మండల అధ్యక్షులు పి. గోపాల్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే స్ఫూర్తితో ఉపాధ్యాయులు సేవలు అందించాలన్నారు. ఉపాధ్యాయినులు కె.అన్నపూర్ణ, లీలావతమ్మ, సుప్రీ కుమారి, అంధులైన ఉపాధ్యాయ దంపతులు ఉదయ లక్ష్మి, గంగాధరరావులను ఘనంగా సన్మానించారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ఐసీసీ, సహేలీ గరల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఐసీసీ ఇన్‌చార్జి ప్రిసైడింగ్ ఆఫీసర్ డాక్టర్ కె. శోభారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
- **చాట్రాయి:** సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ బ్రహ్మాచారి అన్నారు. మర్లపాలెం జెడ్పీ హైస్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు పి.రాఘవరావు సహకారంతో విద్యార్థులకు భోజనం, పండ్లు అందజేశారు. ఉపాధ్యాయినులను సన్మానించారు.హెచ్‌ఎం ఎ.బక్కయ్య, ఉపాధ్యాయులు సతీష్, రఘు తదితరులు పాల్గొన్నారు.
- **గంపలగూడెం:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గంపలగూడెం మండల పరిషత్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. మండలంలోని 55 ప్రాథమిక పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 60 మంది ఉపాధ్యాయినులను, గంపలగూడెం సర్పంచి పుల్లమ్మను ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు సత్కరించారు. డీపీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, 9 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే 52 మంది ఉపాధ్యాయినులను ఆయా పాఠశాలల్లో సత్కరించారు.
- **విస్సన్నపేట:** మహిళా విద్యను ప్రోత్సహించి బడుగు, బలహీనవర్గాల మహిళా అభ్యున్నతికి కృషి చేసిన సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచిపోయారని బహుజన దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. విస్సన్నపేట రెడ్డిగూడెంలోని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి బహుజన దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేదిక నాయకులు గొర్రె లాజరస్, పల్లెపాము లక్ష్మయ్య, ధనరాజ్, కంకట మోహన రావు తదితరులు పాల్గొన్నారు.
- **తిరువూరురూరల్:** మండలంలోని మునుకుళ్ల జెడ్పీ హైస్కూల్, లక్ష్మీపురం ఎంపీ యూపీ పాఠశాలల్లో శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునుకుళ్ల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులను ప్రధానోపాధ్యాయుడు బీవీ రావు, విద్యార్థులు సత్కరించారు.
- **తిరువూరు:** స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బీసీ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయినులను సంఘ సభ్యులు సత్కరించారు. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, పాఠశాల హెచ్‌ఎం పీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.
- **మునునూరు:** చెక్కపల్లిలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్నారులకు సావిత్రిబాయి జీవిత విశేషాలు తెలిపారు. హెచ్‌ఎం ధన నాగ లక్ష్మిని సన్మానించారు.
- **నూజివీడు:** నూజివీడు పట్టణంలోని త్రివిధ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయిని ఘంటసాల నాగశైలజను సత్కరించారు.



కొండపల్లిలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

సవరణ

[illegible]

T.V.N. [illegible]

సంక్షిప్తంగా....

- **భూ సమస్యలపై అధికారులకు అర్జీలు**

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. సర్పంచి ఉయ్యూరు గోపాలరావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు రైతులు తమ సమస్యలపై అధికారులకు అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొత్తపల్లి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఎన్ని దఫాలు మా సమస్యలపై దరఖాస్తులను అందజేసినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరం 11 సెంట్లు మా భూమి ఉంటే ఎకరానికి మాత్రమే పట్టాదారు పాస్‌పుస్తకం అందజేశారని చెప్పారు. అడంగళ్‌లో ఎకరం 11 సెంట్లు ఉందని పాస్‌పుస్తకంలో తగ్గించి ఇచ్చారన్నారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగేంద్రమ్మకు చెందిన 12 సెంట్ల భూమి పోలవరం కాల్వలో పోతే ఆమె భూమి మా భూమిలో ఉందని చెప్పడం గందరగోళంగా ఉందన్నారు. రీ సర్వేలో ఎల్‌పీ నంబర్ ఇచ్చారని నాగరాజు అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. పలువురు సమస్యలపై అర్జీలు అందజేశారు. ఆర్ఐ రాజేష్, వీఆర్వో చక్రధరరావు, దేవదాయ శాఖాధికారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

- **నల్ల బ్యాడ్జీలతో పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన**

ఇబ్రహీంపట్నం: ఈలప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యదర్శి పవన్‌కుమార్‌పై దాడిని ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. ఇబ్రహీంపట్నం కేడీసీసీ బ్యాంక్ ఉద్యోగులు, వివిధ గ్రామాల్లోని పీఏసీఎస్ సంఘాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. పీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కొండల శర్మ తదితరులు పాల్గొన్నారు.

- **నూజివీడు:** రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు నూజివీడు సొసైటీ ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సొసైటీ సీఈఓ నీలం నాగేశ్వరరావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

- **న్యాయవాదుల ఆందోళన**

నూజివీడు: అనంతపురంలో సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ డిమాండ్ చేశారు. శేషాద్రి మృతిపై న్యాయ విచారణ చేసి నిందితులను శిక్షించాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు కోర్టు వద్ద ఆందోళన నిర్వహించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి మడుపల్లి మధు రవిశంకర్, సీనియర్ న్యాయవాదులు జేడీ గాంధీ, బసవరాజు రామకృష్ణ, దొర్రై తదితరులు పాల్గొన్నారు.

- **కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల ధర్నా**

నూజివీడు: మున్సిపల్ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. నూజివీడు పురపాలక సంఘం కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జి.రాజు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, గతంలో సమ్మె చేసినప్పుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వేతనాలను రూ.30 వేలకు పెంచాలని, మున్సిపాలిటీలో కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయలక్ష్మి, రజనీ, రాధ, భారతి, భవానీ, గౌరీ, రంగమ్మ, గోవిందు, ఏడుకొండలు, గాంధీ, ఏసుబాబు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- **వీధి కుక్కల స్వైర విహారం**

మైలవరం: మైలవరం రాజాపేటలో వీధికుక్కలు స్వైరవిహారం చేశాయి. గురువారం వీధి కుక్కలు దాడి చేసి ఒకేరోజు ఎనిమిది మందిని గాయపరిచాయి. పొందుగల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పూలు కొనుగోలుకు రాజాపేట వస్తుండగా వీధి కుక్క వెంటబడి కరిచింది. పిల్లలు, మహిళలపై కూడా దాడి చేసి వీధి కుక్కలు గాయపరుస్తుండటంతో వీధుల్లోకి రావాలంటేనే గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మైలవరం రామకృష్ణ కాలనీ, ఆర్టీసీ బస్‌స్టాండ్ వెనుక రోడ్డులో వీధి కుక్కలు సంచరిస్తూ వాహనదారులు, పాదచారులపై దాడి చేస్తున్నాయి. వీధి కుక్కల నిర్మూలనకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- **రేపు టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక**

నూజివీడు: కృష్ణా జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక ఈ నెల 5న నూజివీడులో జరుగుతుందని అసోసియేషన్ కార్యదర్శి దాసరి సూర్యనారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే ఎంపికకు 2006 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత జన్మించిన వారు హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 11, 12 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలోని పలాసలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 79898 77355, 94406 96797 నంబర్లను సంప్రదించాలన్నారు.

- **ఎస్సీ ఉపకులాల జాబితాల్లో తప్పులపై ఫిర్యాదు**

తిరువూరు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో భాగంగా వార్డు సచివాలయాల్లో ప్రకటించిన జాబితాల్లో తప్పులు ఉన్నాయని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శీలం రామారావు శుక్రవారం తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజుకు ఫిర్యాదు చేశారు. మాదిగ, ఉప కులాల వివరాలను జాబితాలో పొందుపరచడంలో పలు లోపాలున్నాయని, వీటిని సవరించి తిరిగి ప్రచురించాలని కమిషనర్‌ను కోరారు. ఎంఈఎఫ్ నాయకులు గుర్రాల దేవదాసు, ఇమ్మానియేలు, మోదుగు కాటయ్య, నాని తదితరులు పాల్గొన్నారు.

- **స్వామివార్లకు ప్రత్యేక పూజలు**

గంపలగూడెం: స్థానిక సీతారామచంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 19వ రోజు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పలు రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. గంపలగూడెం భజన మందిరం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాలు, నెమలి వేణుగోపాలస్వామి దేవాలయం, పెదకొమిర వెంకటేశ్వరస్వామి దేవస్థానాలలో ధనుర్మాస ప్రత్యేక పూజలు జరిగాయి.

- **స్టడీ మెటీరియల్ అందజేత**

మైలవరం: మైలవరం మండలంలోని 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మండలంలోని వెల్వడం గ్రామానికి చెందిన లకిరెడ్డి చిన్న పుల్లారెడ్డి ఆర్థిక సాయంతో 545 మంది విద్యార్థులకు పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ 2025 క్యాలెడర్, డైరీలు ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

- **ముసునూరు:** రమణక్క పేట జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.పద్మకిశోర్, జి.రాంబాబు ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు అమ్ముల సుధాకర్‌రావు సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులు 56 మందికి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

- **700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం**

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాలో కూడా 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎక్సైజ్ సీఐ జె. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

- **రేషన్ దుకాణాల తనిఖీ**

మైలవరం: ప్రతి లబ్ధిదారుకు రేషన్ సరుకులు సక్రమంగా అందేలా చూడాలని రెడ్డిగూడెం తహసీల్దార్ జె. సుశీలాదేవి అన్నారు. రంగాపురం, రాఘవాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ సుశీలాదేవి శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, గ్రామ రెవెన్యూ అధికారి ఎస్‌కే జానీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.